PRGI NO TGTEL/26/A2948

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 13 ॥ శుక్రవారం ॥ 12-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



## దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే
# బలమైన పునాది

**నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టీకరణ**

**కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనా వివరించిన సీఎం**

**విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరం**

**ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడి**



న్యూఢిల్లీ, జూన్ 11: దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదని నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను నీతి ఆయోగ్‌లో ఆయన వివరించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు.

## పార్టీ బలోపేతంపై
# ప్రత్యేక దృష్టి

**ఇందిరా భవన్‌లో చర్చలు**

**కాంగ్రెస్ కీలక సంస్థాగత సమావేశం**

**జాతీయ నాయకుల సమక్షంలో సమావేశం**

**న్యూఢిల్లీ, జూన్ 11 :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కీలక సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, సంస్థాగత వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై కార్యాచరణ (మిగతా 2వ పేజీలో)


# గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక అధికారుల నియామకం

లోపల పేజీల్లో..



## టీఆర్ఎస్ పేరుపై
# వివాదం

**హైదరాబాద్, జూన్ 11 :** ఈ వ్యవహారంలో భారత్ రాష్ట్ర సమితి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. టీఆర్ఎస్ అనే పేరు తెలంగాణ ఉద్యమ చరిత్రతో ముడిపడి ఉందని, ఉద్యమ కాలం నుంచి ప్రజల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచి ందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రజలు తమ పార్టీని టీఆర్ఎస్ పేరుతోనే గుర్తిస్తున్నారని వాదిస్తూ, ఆ పేరును మరో రాజకీయ సంస్థకు కేటాయించరాదని ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇదిలా ఉండగా, కవిత పార్టీ ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన తెలంగాణ రాష్ట్రసామాజిక సేన అనే సంస్థ (మిగతా 2వ పేజీలో)



## ఒమన్ తీరంలో భారత
# నౌకపై దాడి

**ఉద్రిక్తతలతో ఆందోళన**

**న్యూఢిల్లీ, జూన్ 11 :** ఒమన్ తీరంలో భారతీయ నావికులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌక ఎంటీ జల్వీర్‌పై దాడి జరిగినట్లు సమాచారం వె లువడింది. ఒమన్‌లోని షినాస్ నౌకాశ్ర యం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ప్రాథమిక వివరాలు సూచి స్తున్నాయి. నౌకలో ఇరవై మందికిపైగా భారతీయ నావికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఘటన అనంతరం నౌక నుంచి భారీగా నల్లటి పొగలు (మిగతా 2వ పేజీలో)



## ప్రతి కుటుంబానికి
# ప్రభుత్వ అండ

**ప్రజలతో నేరుగా మమేకం**

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**అభివృద్ధి పనులకు ప్రాధాన్యం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



# జులై 2న భూపోరాటం

**పోస్టర్ ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత**

**ఉద్యమకారుల భూముల డిమాండ్.. ప్రజలకు పాల్గొనాలంటూ పిలుపు**

హైదరాబాద్, జూన్ 11: బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఉద్యమకారుల భూపోరాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై తీవ్ర (మిగతా 2వ పేజీలో)



# వికసిత భారత్ దిశగా అడుగులు

**నీతి ఆయోగ్ సమావేశంలో అమిత్ షా**

**ప్రధానితో కీలక సమావేశం**

**అభివృద్ధి లక్ష్యాలపై చర్చ**

**న్యూఢిల్లీ, జూన్ 11**

దేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేం దుకు ఈ సంస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం కేవలం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడటమే కాకుం డా అనేక రంగాల్లో ముందంజలో సాగుతోందని ఆయన అభిప్రాయ పడ్డారు. ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, (మిగతా 2వ పేజీలో)

# తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక

**నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారనున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రంగారెడ్డి, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, యాదాద్రి-భువనగిరి, సూర్యాపేట, జంగావు, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.**

రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించింది. ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉండగా, హైదరాబాద్‌లో మధ్యాహ్నం వరకు వేడిగా, పొడి వాతావరణం కొనసాగి అనంతరం వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. తక్కువ సమయంలో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పట్టణ ప్రాంతాల్లో నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు, ప్రయాణికులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# నేటి రాశి ఫలాలు

**మేషం :** ప్రారంభించిన పనులలో ఆటంకాలు ఎదురైనప్పటికీ అధిగమిస్తారు. ఆపదలు తొలగుతాయి. సంబంధబాంధవ్యాలను పటిష్టం చేసుకోవడం మంచిది. ఆచితూచి మాట్లాడాల్సి ఉంటుంది. విష్ణు సహస్రనామ పారాయణ, అష్టలక్ష్మీ స్తోత్రం పఠిస్తే మంచిది.

**వృషభం :** మనోబలంతో ముందుకు సాగి అనుకున్నది సాధిస్తారు. అవసరానికి తగిన సహాయం అందుతుంది. బంధుమిత్రులతో కలిసి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. భోజన సౌఖ్యం కలదు. ఇష్టదైవారాధన శుభప్రదం.

**మిథునం :** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాది రంగాలలో ఆశించిన ఫలితాలు ఉన్నాయి. ఉత్సాహంగా, ముందుకు సాగండి. బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. ఒక సంఘటన సంతోషాన్ని కలిగిస్తుంది. శ్రీఆంజనేయస్వామిని ఆరాధిస్తే బాగుంటుంది.

**కర్కాటకం :** ప్రారంభించిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయగలుగుతారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాది రంగాలలో అనుకూలమైన వాతావరణం ఉంటుంది. మీ అధికార పరిధి పెరుగుతుంది. సంతానాభివృద్ధికి సంబంధించిన శుభవార్త వింటారు. గణనాయకాష్టకం పఠిస్తే మంచిది.

**సింహం :** అభివృద్ధికి సంబంధించిన శుభవార్త వింటారు. ఒత్తిడి పెరగకుండా చూసుకోవాలి. కుటుంబ సభ్యుల మాట వినండి, మంచి జరుగుతుంది. ఇష్టదైవ సందర్శనం ఉత్తమం.

**కన్య :** మీ అధికార పరిధి పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో లాభాలు ఉన్నాయి. బంధువులతో ఆనందాన్ని పంచుకుంటారు. గణపతిని ఆరాధిస్తే ఇంకా మంచి ఫలితాలు పొందగలరు.

**తుల :** అదృష్ట ఫలితాలు ఉన్నాయి. మీ మీ రంగాల్లో మంచి జరుగుతుంది. కొన్ని వ్యవహారాలలో ధైర్యంగా వ్యవహరించి అందరి నుంచి ప్రశంసలు అందుకుంటారు. శివారాధన శుభకరం.

**వృశ్చికం :** శుభ ఫలితాలు ఉన్నాయి. మీ బుద్ధిబలంతో అందరినీ ఆకట్టుకుంటారు. కుటుంబాభివృద్ధికి సంబంధించిన శుభవార్త వింటారు. మానసికంగా ఉల్లాసంగా ఉత్సాహం గా ఉంటారు. ఇష్టదైవారాధన శ్రేయస్సును ఇస్తుంది.

**ధనుస్సు :** పెద్దల సహకారం మీ అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రారంభించిన పనులలో ఆటంకాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తారు. ముందుజాగ్రత్త లేకపోవడం వల్ల అనవసర ఖర్చులు వస్తాయి. కొన్ని సంఘటనలు బాధ కలిగిస్తాయి. హనుమాన్ చాలీసా పఠిస్తే మంచి ఫలితాలు లభిస్తాయి.

**మకరం :** ప్రారంభించిన పనులను పట్టుదలతో పూర్తిచేస్తారు. శుభకార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబంలో కాస్త ఇబ్బందికర వాతావరణం ఏర్పడుతుంది. దక్షిణామూర్తి స్తోత్రం చదివితే మంచిది.

**కుంభం :** మధ్యమ ఫలితాలు ఉన్నాయి. ప్రారంభించిన పనులలో ఆటంకాలు ఎదురవుతాయి. బుద్ధిబలంతో వ్యవహరిస్తే సరిపోతుంది. చిన్నపాటి సమస్యలు ఉన్నప్పటికీ మీ బుద్ధిబలంతో వాటిని అధిగమిస్తారు. దుర్గాష్టకం చదివితే మంచిది.

**మీనం :** అవసరానికి తగిన సహాయం అందుతుంది. బంధుమిత్రుల సలహాలు సూచనలు పాటించకపోవడం వల్ల ఇబ్బందులు పడతారు. ప్రణాళిక లేకపోవడంవల్ల అనవసర ఖర్చులు పెరుగుతాయి. అలసట పెరుగుతుంది. శివారాధన శ్రేయస్కరం.






# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

న్యూఢిల్లీ, జూన్ 11: గురువారం రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధేనని గుర్తు చేశారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (రాజుజుజుూజ)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. గడచిన 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**నల్లగొండ, జూన్ 11**

ప్రజలతో నేరుగా మమేకమవడం, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను చూపడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండలోని తన శిబిర కార్యాలయంలో ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సానుకూలంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వివరించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా పనిచేస్తానని తెలిపారు.

# మెట్రో ఫేజ్-2 విస్తరణకు ఆమోదం తెలపండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా గోదావరి జలాల వినియోగం తెలంగాణకు అత్యంత కీలకమని వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి ఏడు మార్గాల్లో మొత్తం 122.9 కిలోమీటర్ల మేర విస్తరణ ప్రతిపాదనలను

దాదాపు ముప్పై ఎనిమిది వేల ఐదు వందల తొంభై ఐదు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్య పథకంగా ఆమోదించాలని కోరారు. హైదరాబాద్ ప్రాంతీయ వలయ రహదారి పనులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగానికి సంబంధించిన భూసేకరణలో గణనీయమైన పురోగతి సాధించినట్లు వివరించారు. దక్షిణ భాగం నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. హైదరాబాద్--అమరావతి--బందరు నౌకాశ్రయం మధ్య ప్రతిపాదించిన పన్నెండు వరుసల వేగవంతమైన రహదారికి కూడా కేంద్రం ఆమోదం తెలపాలని కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు నౌకాశ్రయ అనుసంధానం లభిస్తుందని, ఔషధ, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. వరంగల్ విమా నాశ్రయం అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని, హైదరాబాద్‌లో భారతీయ నిర్వహణ సంస్థను ఏర్పాటు చేయాలని కూడా ముఖ్యమంత్రి కోరారు. విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ ఇప్పటికే పూర్తయిందని, నిర్వహణ సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించేందుకు సిద్ధంగా ఉందని ప్రధానికి వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# ఒమన్ తీరంలో భారత నౌకపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఎగసిపడుతున్న దృశ్యాలు వెలుగులోకి రావడంతో ఆందోళన నెలకొంది. ఘటనపై స్పందించిన ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం, ఎంటీ జల్వీర్‌కు సంబంధించిన పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పూర్తి సమాచారం సేకరిస్తున్నామని వెల్లడించింది. ప్రస్తుతం దాడి స్వరూపం, నౌకకు జరిగిన నష్టం, సిబ్బంది పరిస్థితిపై అధికారిక వివరాలు ఇంకా వెలువడలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ నౌకపై డ్రోన్ లేదా క్షిపణి దాడి జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. ఇటీవల హోర్ముజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో వరుసగా వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతుండటంతో అంతర్జాతీయ నౌకాయాన రంగంలో భద్రతా ఆందోళనలు పెరుగుతున్నాయి. అమెరికా, ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఈ ఉద్రిక్తతల ప్రభావం కీలక సముద్ర వాణిజ్య మార్గాలపై పడుతోంది. హోర్ముజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలక మార్గంగా ఉండటంతో అక్కడి ప్రతి ఘటన అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత సంతరించు కుంటోంది. ఇటీ వలే ఒమన్ తీరంలో భారతీయ నావికులు ఉన్న మరికొన్ని నౌకలు కూడా దాడులకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం నౌకాయాన భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎంటీ జల్వీర్ ఘటనలో సిబ్బంది క్షేమంగా ఉన్నారా లేదా అనే అంశంపై అధికారిక సమాచారం కోసం వారి కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. దర్యాప్తు కొనసాగ ుతున్న నేపథ్యంలో దాడి వెనుక ఉన్న కారణాలు, బాధ్యు లపై స్పష్టత రావాల్సి ఉంది. భారత రాయబార కార్యా లయం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయ చర్యలు చేపడుతోంది.




# జులై 2న భూపోరాటం

(మొదటి పేజీ తరువాయి)

అసంతృప్తి వ్యక్తం చేశారు. జులై 2న ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో భూపోరాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కవిత ప్రకటించారు. ఉద్యమకారులకు కేటాయించాలని నిర్ణయించిన భూముల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు రెండువందల యాభై గజాల భూమి ఇస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అమలు జరగలేదని ఆమె విమర్శించారు. అర్హులైన ఉద్యమకారులను గుర్తించి వెంటనే భూములు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ భావజాలంపై కొందరు దాడి చేస్తున్నారని కవిత ఆరోపించారు. తెలంగాణ స్ఫూర్తిని దెబ్బతీయడానికి కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జులై 2న నిర్వహించే భూపోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి తెలంగాణవాది బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరగాలని కోరుకునే ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత, మహిళలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం ఉద్యమకారులు తమ జీవితాలను అంకితం చేశారని కోరారు.

# నామినేషన్ తిరస్కరణ వ్యవహారం

## సుప్రం కోర్టులో మీనాక్ష నటరాజన్ పిటిషన్... నేడు విచారణ చేస్తామని చెప్పిన సుప్రీం

న్యూఢిల్లీ,జూన్11: మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన క్రమంలో.. ఈ అంశంపై తక్షణమే విచారణ చేపట్టాలని మీనాక్షి గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. మీనాక్షీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తున్నారు. తప్పుడు రీతిలో మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. కానీ రాజ్యసభ ఎన్నిక ప్రక్రియ ముగిసిన తర్వాతే ఎలక్షన్ పిటీషన్ నమోదు చేయాలని మీనాక్షికి సుప్రీంకోర్టు చెప్పినట్లు తెలుస్తోంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు ఆమోదించింది. మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ సీట్ల కోసం జూన్ 18వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అయితే మంగళవారం అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ అకస్మాత్తుగా మీనాక్షీ నటరాజన్ పిటీషన్‌ను తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి జలక్ తగిలింది. మీనాక్షి అసంపూర్ణంగా డాక్యుమెంట్లు సమర్పించినట్లు అరవింద్ శర్మ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. తనపై కోర్టు కేసు ఉన్న విషయాన్ని ఆమె ఫామ్ 26లో పొందుపరచలేదని ఆర్వో తెలిపారు. 2025 అక్టోబర్‌లో హైదరాబాద్ కోర్టుకు నోటీసుకు నటరాజన్ స్పందించారని, కానీ ఫామ్ 26లో ఈ విషయాన్ని చెప్పలేదని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. తెలంగాణలో మీనాక్షీపై కేసు నమోదు అయ్యిందని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్ 8వ తేదీన నామినేషన్ ఫైలింగ్‌కు చివరి తేదీ. మంగళవారం రోజున ఆ పేపర్లను స్క్రూటినీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నాటరాజన్ తన నామినేషన్‌ను తిరస్కరించినందుకు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఆమె కోర్టును కోరారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరపనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ జూన్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) నుంచి తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు.

శ్వేత

సంపాదకీయం

శుక్రవారం 12-6-2026

# మమత అరాచకాలకు కాంగ్రెస్ అండ!

మాములు వావాయి చెప్పులు...ముతక చీర..చంకలో సంచీ వేసుకుని సామాన్య స్త్రీలా కనిపించే ఆహార్యంతో ..పదిహేనేళ్లపాటు బెంగాల్‌ను ఏలిని మమతా బెనర్జీ, ఆ రాష్ట్రాన్ని ఎంతమేరకు భ్రష్టు పట్టించాలో అంతగా భ్రష్టు పట్టించారు. ఏం సాధించారంటే ఏమీ లేదు. అధికారం కోసం ఎంతకైనా తెగించడం అలవాటు చేసుకున్నారు. సంసారం పిల్లలు లేరు. అయినా మేనల్లుడిని పెట్టుకుని బెంగాల్‌లో రాజ్యమేలారు. నందిగ్రామ్‌తో రాష్ట్రంలోకి పరిశ్రమలు రాకుండా అడ్డుకుని, ప్రజల్లో మంచి ఇమేజ్ సాధించి..అదే ప్రజలను రాచిరంపాన పెట్టిన రాక్షసిగా పేరుగడించారు. పదిహేనేళ్లుగా అధికార మదంతో తనకు తిరుగులేదనిపించారు. అన్నింటికి మించి భారత భద్రతకు విఘాతం కలిగించారు. పొరుగునే ఉన్న బంగ్లాదేశీయులు యధేచ్ఛగా బెంగాల్లోకి గోడదూకారు. ఇక్కడే తిష్టవేశారు. వారిని ఓటు బ్యాంకుగా మలచుకున్న మమత బెనర్జీ దేశానికి సవాల్ విసిరిన అక్రమ వలసదారుల ఆగడాలను గుర్తించలేదు. తనకు తిరుగులేదని భావించి అనరాచక పాలనకు తెరతీసారు. రేప్‌లు, మర్డర్లు, దోపిడీలు, దొమ్మీలు జరుగుతున్నా.. పట్టించుకోలేదు. సామాన్యులు భయంభయంగా బతికారు. బిజెపి దెబ్బతో ఇప్పుడు దిమ్మతిరిగి నేలమీద పడ్డారు. తన ఉనికికే సవాల్‌గా మారింది. దీంతో కాంగ్రెస్‌తో కాళ్బేరానికి వచ్చారు. అందుకే మమతాబెనర్జీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. టీఎంసీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన 3 రోజులకే మరో ఎంపీ సుష్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం ఆమె అస్సాం సీఎం హిమంత శర్మతో సమావేశమయ్యారు. త్వరలో ఆమె బీజేపీలో చేరతారని సమాచారం.

అస్సాంకు చెందిన సుష్మితా దేవ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సంతోష్ మోహన్ దేవ్ కుమార్తె. గతంలో ఆమె అస్సాంలోని సిల్చార్ నుంచి గెలుపొందారు. ఇకపై అస్సాంలోనే రాజకీయాలు చేస్తానని, బెంగాల్‌లో కాదని ఆమె స్పష్టం చేశారు. తాజాగా ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ దాదాపు టిఎంసి ఖాళీ అవుతోంది. నిజానికి ప్రాంతీయ పార్టీలు ఇంతగా దెబ్బతిన్న దాఖాలు ఏ రాష్ట్రం లోనూ లేవు. మమత మీద విశ్వాసం లేదంటే ఆమె ఎంతగా నియంతలా వ్యవహరించారో తెలిసిపోతోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టుకున్నారు. టీఎంసీకి చెందిన 19 మంది ఎంపీలు తిరుగుబాటు చేసి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఈ బృందానికి టీఎంసీ సీనియర్ ఎంపీ కాకోలీ ఘోష్ నేతృత్వం వహిస్తున్నారు. దీదీకి అత్యంత విధేయంగా ఉన్న శత్రుఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్, సయాని ఘోష్ కూడా తిరుగుబాటు బృందంతో చేతులు కలిపారు. జగదీశ్ చంద్ర మసునియా, ఖలి ఉర్ రహమాన్, అబు తాహిర్ ఖాన్, పార్థ భౌమిక్, బాపి హల్దార్, మాలా రాయ్, మితాలీ బాగ్, దీపక్ అధికారి, కాలీపాద సొరేన్, జూన్ మాలియా, అరూప్ చక్రవర్తి, షర్మిలా సర్కార్, అసిత్ కుమార్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ కూడా తిరుగుబాటుదారుల బృందంలో ఉన్నారు. టీఎంసీకి లోక్‌సభలో 28 మంది సభ్యులుండగా 19 మంది రెబల్స్‌గా ప్రకటించుకున్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ శాసనసభకు ఇటీవల ఎన్నికైన 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 64 మంది తిరుగుబాటు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో చీలికలు, నేతల రాజీనామాల నేపథ్యంలో ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత సోనియాగాంధీ ప్రతిపాదించినట్టు సమాచారం. మమతను దారికి తెచ్చుకోవడానికి, బెంగాల్లో కాలు మోపడానికి కాంగ్రెస్‌కు ఇదొక్కటే అవకాశం. అయితే ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు కొంత సమయం కావాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కోరినట్టు సమాచారం. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారం కోల్పోయి, బీజేపీ పాలన ప్రారంభమైన దరిమిలా.. టీఎంసీలో అంతర్గత కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. మరోవైపు బీజేపీ నుంచి ఒత్తిళ్లు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేయడమే పరిష్కారమని సోనియా సూచించినట్టు తెలిసింది. మరోవైపు, అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నేత రాహుల్‌తో భేటీ అయ్యారు.

టీఎంసీ అగ్రనేతలుగా ఉన్న వారు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేయడంతో పాటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతిస్తామని ప్రకటించారు. దీంతో పార్టీ భవితవ్యంపై మమత తల్లడిల్లుతున్నారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో ఏవిధంగా ముందుకు సాగాలన్నది మరింత ఇబ్బందికరంగా మారింది. 64 మంది ఎమ్మెల్యేలు.. రితబ్రత బెనర్జీ నేతృత్వంలో చీలిపోగా, 28 మంది ఎంపీల్లో 20 మంది కకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో విడిపోయి.. ఎన్డీయేకు మద్దతిస్తామని, తమను ప్రత్యేక సమూహంగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖరాశారు. ఈ పరిణామాలతో టీఎంసీ పార్టీ మమత చేతుల్లోంచి జారిపోయే ప్రమాదం ఏర్పడింది. చీలిక వర్గాలకు 'గుర్తింపు' లభిస్తే.. పార్టీ గుర్తు, జెండా సహా టీఎంసీ ఆస్తులపైనా హక్కులు లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ ఢిల్లీలో సోనియాగాంధీని కలుసుకుని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం బుధవారం కూడా మరోసారి ఇరువురు భేటీ అయ్యారు. ఈ సందర్భంగానే సోనియాగాంధీ.. విలీన ప్రతిపాదనను మమత ముందు ఉంచారని టీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా బీజేపీని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని ఆమె సూచించారని పేర్కొన్నాయి. టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే, మమతా బెనర్జీకి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవితోపాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ప్రధాన కార్యదర్శి పదవులు ఇస్తామని సోనియాగాంధీ హామీ ఇచ్చినట్టు తెలిపాయి. ఈ ప్రతిపాదనపై తక్షణమే నిర్ణయం తీసుకోలేనని, కొన్ని రోజుల సమయం కావాలని మమత కోరినట్టు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి.

టీఎంసీ విలీన ప్రతిపాదన వార్తలపై బెంగాల్ కాంగ్రెస్ విభాగం సీనియర్ నాయకులు తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. అక్రమార్కులు, అన్యాయాలు చేసిన పార్టీని కాంగ్రెస్‌లో ఎలా కలుపుకొంటారని నిలదీస్తున్నారు. అధికారికంగా దీనిపై ప్రకటన వచ్చాక తమ నిర్ణయం వెల్లడిస్తామని కొందరు నేతలు తెలిపారు. దీంతో కాంగ్రెస్‌కు కూడా చిక్కులు తప్పేలా లేవు. గతంలో కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన మమత.. 28 ఏళ్ల కిందట 1998లో కాంగ్రెసతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. వరుసగా మూడు సార్లు బెంగాల్ ఎన్నికల్లో విజయం దక్కించుకుని అధికారంలోకి వచ్చారు. అయితే ఆమె పార్టీని కూడా సరిగా నడపలేరని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఎన్నో అక్రమాలు చేఇవుంటే తప్ప ఇప్పుడు బిజెపికి భయపడాల్సిన అవసరం లేదు. కానీ అరాచక పాలన సాగించిన పాపానికి ఆమెకు భవిష్యత్ ఉంటుందా అన్నది అనుమానమే.



# 'మేడ్ ఇన్ ఇండియా' సీ-295 సూపర్ సక్సెస్

### భారత రక్షణ రంగంలో చారిత్రాత్మక మైలురాయి

### వడోదరా ప్లాంట్ నుంచి తొలి ప్రయాణ పరీక్ష విజయవంతం

### పాత 'ఆవ్రో-748' స్థానంలో వైమానిక దళంలోకి చేరిక

వడోదరా/న్యూఢిల్లీ, జూన్ 11: భారత రక్షణ రంగ చరిత్రలో సరికొత్త స్వర్ణ అధ్యాయం లిఖించబడింది. దేశీయంగా తయారైన మొట్టమొదటి 'మేడ్ ఇన్ ఇండియా' సీ-295 సైనిక రవాణా విమానం తన తొలి ప్రయాణ పరీక్షను (టెస్ట్ ఫ్లైట్) విజయవంతంగా పూర్తి చేసుకుంది. గుజరాత్‌లోని వడోదరాలో ఉన్న ఫైనల్ అసెంబ్లీ లైన్ ప్లాంట్ నుంచి రన్‌వేపై దూసుకెళ్తూ గాల్లోకి లేచిన ఈ విమానం, తన తొలి గగన విహారాన్ని ముగించుకుని సురక్షితంగా ల్యాండ్ అయింది. భారత రక్షణ చరిత్రలోనే ప్రైవేట్ రంగానికి చెందిన ఒక సంస్థ మిలిటరీ విమానాన్ని రూపుదిద్దడం ఇదే తొలిసారి కావడం విశేషం. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, ప్రముఖ విమాన తయారీ సంస్థ 'ఎయిర్‌బస్' సంయుక్త భాగస్వామ్యంతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో ఈ రవాణా విమానాన్ని తయారు చేశారు. ఈ ఘనతతో అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ రంగంలో భారతదేశం తన సరికొత్త సత్తాను చాటినట్లయింది.

### రూ. 21,935 కోట్ల భారీ ఒప్పందం.. ప్రత్యేకతలు ఇవే

భారత వైమానిక దళాన్ని ఆధునీకరించేందుకు మొత్తం 56 సీ-295 విమానాల కొనుగోలు కోసం స్పెయిన్ దేశంతో రూ. 21,935 కోట్ల భారీ ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 56 విమానాలలో 16 విమానాలు నేరుగా స్పెయిన్ నుండి తయారై భారత్‌కు చేరుకోగా, మిగిలిన 40 విమానాలను 'మేక్ ఇన్ ఇండియా' పథకంలో భాగంగా వడోదరా ప్లాంట్‌లో తయారు చేస్తున్నారు. ఈ స్థానిక తయారీ శ్రేణిలో సిద్ధమైన మొట్టమొదటి విమానం ఇదే కావడం గమనార్హం. వైమానిక దళంలో చాలా కాలంగా సేవలందిస్తూ కాలం చెల్లిన పాత 'ఆవ్రో-748' విమానాల స్థానాన్ని ఈ సరికొత్త సీ-295 విమానాలు భర్తీ చేయనున్నాయి. ఇవి దాదాపు 70 మంది సైనికులను లేదా 48 మంది పారాట్రూపర్లను ఒకేసారి రణరంగానికి మోసుకెళ్లే అసాధారణ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

### కొండ ప్రాంతాలు, చిన్న రన్‌వేలపై ల్యాండింగ్ సామర్థ్యం

రెండు పవర్‌ఫుల్ టర్బోప్రాప్ ఇంజన్లతో నడిచే ఈ విమానాలకు ప్రత్యేక రన్‌వేలు అవసరం లేదు. సరిహద్దుల్లోని అత్యంత క్లిష్టమైన కొండ ప్రాంతాలు, చిన్న రన్‌వేలపై కూడా ఇవి అత్యంత సులభంగా టేక్ ఆఫ్ అవ్వడంతో పాటు ల్యాండ్ కాగలవు. సైనిక అవసరాలకే కాకుండా, దేశంలో సంభవించే ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సామగ్రిని వేగంగా అందించడంలోనూ ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి.

### ఏరోస్పేస్ రంగంలో భారత్ ఎదుగుదలకు నిదర్శనం: కేంద్ర మంత్రి

ఈ అద్భుత ఘనతపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "ఇది కేవలం ఒక సరికొత్త విమానం గాల్లోకి ఎగరడం మాత్రమే కాదు. అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ రంగంలో భారతదేశం సాధిస్తున్న అద్భుత ఎదుగుదలకు నిదర్శనం. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును విజయవంతం చేసిన భారత వైమానిక దళం, టాటా, ఎయిర్‌బస్ బృందాలతో పాటు అహర్నిశలు శ్రమించిన ఇంజనీర్లు, కార్మికులకు నా హృదయపూర్వక అభినందనలు." అని పేర్కొన్నారు.

## టీఆర్ఎస్ పేరుపై వివాదం

(మొదటి పేజీ తరువాయి)

కూడా టీఆర్ఎస్ సంక్షిప్త నామం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ పేరుపై పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో ప్రజల నుంచి కూడా పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పత్రికల్లో వచ్చిన ప్రకటనల ఆధారంగా వందల సంఖ్యలో అభ్యంతర పత్రాలు ఎన్నికల సంఘానికి అందినట్లు సమాచారం. దీంతో ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే తెలంగాణ రాజ్య సమితి పేరుతో నమోదైన మరో రాజకీయ పార్టీ కూడా టీఆర్ఎస్ సంక్షిప్త నామం వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎన్నికల సంఘం దృష్టికి తమ వాదనలను తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో కవిత తరపు ప్రతినిధులు త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసి తమ వాదనలను వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకే పేరుపై వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో తెలంగాణ రక్షణ సేనకు టీఆర్ఎస్ సంక్షిప్త నామం దక్కుతుందా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## కాంగ్రెస్ కీలక సంస్థాగత సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల వ్యవహారాల ఇన్‌చార్జీలు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు. రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితి, సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా పార్టీ కార్యక్రమాలను రూపొంది ంచాల్సిన అవసరాన్ని నాయకత్వం ప్రస్తావిం చినట్లు తెలిసింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చ జరిగింది. దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, వివిధ రాష్ట్రాల్లో పార్టీ నిర్వహిస్తున్న ఉద్యమాలు, భవిష్యత్ వ్యూహాలపై నాయకులు సమీక్ష నిర్వహించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచే యాలని నాయకత్వం సూచించినట్లు సమాచారం. సంస్థాగతంగా మరింత బలపడటంతో పాటు ప్రజా సమ స్యలపై పోరాటాలను ఉద్ధృతం చేయాలనే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు అవసరమైన మార్గ దర్శకాలు సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు.

## నీతి ఆయోగ్ సమావేశంలో అమిత్ షా

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక పురోగతి, సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశం వేగంగా ముందుకు సాగుతోందని వివరించారు.

రెండు వేల నలభై ఏడు నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అమిత్ షా తెలిపారు. ఈ లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వాలు, విధాన రూపకర్తలు, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో వివిధ రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళిక లు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల పురోగతిపై చర్చ జరిగినట్లు సమాచారం. దేశాన్ని మరింత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా సమావేశంలో పలు అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు వెల్లడైంది. భారత్‌ను సమగ్ర అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అమిత్ షా స్పష్టం చేశారు. వికసిత భారత్ లక్ష్య సాధనకు అన్ని వర్గాలు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## గవర్నర్‌ను కలిసిన వాసవి ప్రతినిధులు

**హైదరాబాద్, జూన్ 11**

వాసవి క్లబ్స్ అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు గురువారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్ధ వెంకట సూర్యప్రకాశరావు నేతృత్వంలోని బృందం ఈ భేటీలో పాల్గొంది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల గురించి గవర్నర్‌కు వివరించారు. విద్య, వైద్యం, పేదల సంక్షేమం, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను ప్రతినిధులు వివరించినట్లు సమాచారం. సమాజ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి ఎంతో విలువైనదని ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటూ సేవా కార్యక్రమాలను విస్తరించాలని ప్రతినిధులు తమ సంకల్పాన్ని వెల్లడించారు. వాసవి క్లబ్స్ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.

## కుటుంబం అదృశ్యం

**కామారెడ్డి, జూన్ 11**

కామారెడ్డి జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.



తల్లి లయతో పాటు ఆమె ముగ్గురు పిల్లలు బిందు, శివ, దివిజ కనిపించకుండా పోవడం తో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అదృశ్యమైన లయ వయస్సు ముప్పై ఒకటేళ్లు కాగా, పిల్లలు బిందు పదహారేళ్లు, శివ పదమూడేళ్లు, దివిజ ఎనిమిదేళ్ల వయస్సు కలిగి ఉన్నట్లు సమాచారం. ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత వీరి ఆచూకీ లభించకపోవడంతో బంధువులు పోలీసులను ఆశ్రయించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన వారి వివరాలను సేకరించి వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సమీప ప్రాంతాల సమాచారాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ప్రాథమిక విచారణలో కుటుంబ కలహాల కారణంగానే లయ తన పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.



## ఆదిలాబాద్‌లో ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ప్రారంభం

**ఆదిలాబాద్, జూన్ 11**

రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర పోలీసు మహానిర్దేశకుడు సి.వి. ఆనంద్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులు, వాహనదారులు, సాధారణ ప్రజలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రజల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ పెంపొందిం చేందుకు ఇటువంటి శిక్షణ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో రహదారి భద్రత, వాహనాల నిర్వహణ, ట్రాఫిక్ సంకేతాల అవగాహన, ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై శిక్షణ అందించనున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల ప్రమాదాల సంఖ్య తగ్గేఅవకాశం ఉందని పేర్కొన్నారు.

## క్రీడల కోసం నాలుగు ఎకరాల విరాళం

**నాగర్‌కర్నూల్, జూన్ 11 :**

ప్రజా సంక్షేమం పట్ల తన నిబద్ధతను చాటుతూ పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక క్రీడాకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ప్రభుత్వానికి విరాళంగా అందించారు. సుమారు కోటి యాభై లక్షల రూపాయల విలువైన నాలుగు ఎకరాల భూమిని ఈ ప్రయోజనం కోసం కేటాయించారు. కొడేరు మండల తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి స్వయంగా హాజరై భూమి బదిలీకి సంబంధించిన డిజిటల్ పత్రాలపై సంతకాలు చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న తన పేరుపై నమోదైన భూమిని మినీ స్టేడియం నిర్మాణం కోసం ప్రభుత్వానికి అధికారికంగా బదిలీ చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటన సందర్భంగా స్థానిక యువత, క్రీడాకారులు మినీ స్టేడియం ఏర్పాటుపై విజ్ఞప్తి చేయగా, అవసరమైతే తన



సొంత భూమినే ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తూ సర్వే నంబరు ఐదు వందల ముప్పై రెండు--ఏ పరిధిలో ఉన్న నాలుగు ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. భూమి బదిలీ ప్రక్రియను డిజిటల్ విధానంలో పూర్తి చేశారు. వీపనగండ్ల మండల రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన వ్యవస్థ ద్వారా భూమి బదిలీ నమోదై, మినీ స్టేడియం నిర్మాణానికి అధికారికంగా కేటాయింపులు జరిగాయి. ఈ కార్యక్ర మానికి సాక్షులుగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి మౌలిక సదుపాయాలు అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు. క్రీడా మైదానాలు, శిక్షణా వసతులు అందుబాటులో ఉంటే గ్రామీణ యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగు తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కోట్ల రూపాయల విలువైన వ్యక్తిగత భూమిని క్రీడల అభివృద్ధి కోసం విరాళంగా ఇవ్వడంపై స్థానిక ప్రజలు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు కోసం తీసుకున్న ఈ నిర్ణయం ఆదర్శప్రాయమని కొనియాడుతూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## హుస్నాబాద్ బస్టాండ్‌లో మంత్రి పర్యటన

**హుస్నాబాద్, జూన్ 11**

హుస్నాబాద్ బస్టాండ్‌ను రాష్ట్ర రవాణా సంస్థ నిర్వహణ సంచాలకుడు నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లోని సౌకర్యాలు, ప్రయాణికులకు అందుతున్న సేవలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి బస్సుల రాకపోకలు, మౌలిక సదుపాయాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా హుస్నాబాద్ బస్టాండ్ వరద ముప్పును ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంత్రి ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షించారు. వర్షపు



నీరు బస్టాండ్‌లో నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న కాలువను ప్రధాన రహదారి పక్కనున్న మురుగునీటి కాలువకు అనుసంధానం చేసేలా భూగర్భ కాలువ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. దీనివల్ల వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లి బస్టాండ్ ముంపు సమస్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఈ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రవాణా సంస్థ అధికారులు స్థానిక పరిస్థితులను పరిగణ నలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. బస్టాం డ్‌లో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌక ర్యాలు కల్పించేందుకు అవసరమైన పనుల పై కూడా చర్చ జరిగింది. వేచి ఉండే ప్రదేశాలు, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు చిత్తరి పద్మ, కౌన్సిలర్లు, రవాణా సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. హుస్నాబాద్ బస్టాండ్ అభివృద్ధి, వరద ముప్పు నివారణ చర్యలను వేగవంతంగా అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## ఎక్సైజ్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్

**హైదరాబాద్, జూన్ 11**

బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో నిర్వహించిన అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న నూట పదిహేడు మంది అధికారులను అభినందించిన ఆయన, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో మహిళల భాగస్వామ్యం పెరగడం మహిళా సాధికారతకు నిదర్శనమని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన అధికారుల్లో ముప్పై మూడు మంది మహిళలు ఉండడం



గర్వకారణమని పేర్కొన్నారు. ఇరవై నాలుగు మంది సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎనభై తొమ్మిది మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ ద్వారా చట్టాలపై అవగాహన, విచారణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందాయని మంత్రి పేర్కొన్నారు. అయితే అసలు పరీక్ష క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలోనే ప్రారంభమవుతుందని అన్నారు. యూనిఫాం కేవలం హోదాకు మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసానికి ప్రతీక అని గుర్తు చేశారు. ఎక్సైజ్ శాఖను కేవలం ఆదాయ వనరుల శాఖగా చూడకూడదని, ప్రజారోగ్య పరిరక్షణలో కూడా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాను అరికట్టడం ద్వారా యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. తెలంగాణలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నాటుసారా, గుడుంబా, కల్తీ కల్లు, కృత్రిమ మాదకద్రవ్యాల వంటి సమస్యలు కొత్త సవాళ్లుగా మారాయని మంత్రి అన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ వేదికల ద్వారా జరుగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారంపై ప్రత్యేక నిఘా అవసరమని పేర్కొన్నారు. మారుతున్న నేర ధోరణులకు అనుగుణంగా అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

## రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు



**హైదరాబాద్, జూన్ 11**

రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ భవనాలను గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి చర్చించారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వివరాలతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాల పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలు గౌరవప్రదంగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న, శిథిలావస్థలో ఉన్న నూట ఇరవై ఐదు తహసీల్దార్ కార్యాలయాలు, పదకొండు ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టేందుకు నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించి పనులు త్వరగా ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే భవనాలన్నీ ఒకే నమూనాలో ఉండేలా రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా, తక్కువ వ్యయంతో అత్యుత్తమ సేవలు అందించేలా భవనాల నమూనాలు సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**నల్లగొండ, జూన్ 11**

ప్రజలతో నేరుగా మమేకమవడం, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను చూపడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండలోని తన శిబిర కార్యాలయంలో ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని



పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సానుకూలంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకట రెడ్డి పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వివరించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా పనిచేస్తానని తెలిపారు.





# ఓటు హక్కును హరిస్తే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తం

## బిఎల్ఎలే పార్టీకి వెన్నుముక: ప్రభుత్వ విప్ బలమూరి వెంకట్

**సూర్యాపేట జూన్ 11**

ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన అత్యంత కీలకమైన ప్రాథమిక హక్కు అని, ఓటర్ల జాబితా సవరణల పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగిస్తే అంగీకరించబోమని ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు, నల్లగొండ పార్లమెంట్ ఇంచార్జ్ బలమూరి వెంకట్ స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఓబీసీ నాయకులు, సూర్యాపేట నియోజకవర్గ సమన్వయకర్త ప్రొ. కత్తి వెంకటస్వామి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు ఇబ్బంది కలగకూడదు**

సర్వేల (ఓటర్ల సవరణ) పేరుతో పేదలు, కార్మికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు అవసరమైన పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, వారి ఓటు హక్కును కాపాడాల్సిన పూర్తి బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉందన్నారు.

కాంగ్రెస్ పర్యవేక్షణ: ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుందని, ప్రజలకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

**పారదర్శకత ముఖ్యం:**

ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీకి వెన్నుముక బిఎల్ఎలు: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఓటర్ల హక్కుల రక్షణకు బూత్ లెవల్ ఏజెంట్లు వెన్నుముక లాంటివారని కొనియాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, తూముల సురేష్ రావు, ధారవత్ వీరన్న నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైదులుపై కేసు నమోదైనా పోలీసులు అరెస్టు చేయడం లేదు

### అతని నుంచి ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

### విలేకరుల ముందు బాధితురాలు బట్ట ఉమాదేవి ఆవేదన

### స్పందించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి

**సూర్యాపేట జూన్ 11**

తనను వేధింపులకు గురిచేస్తూ, దాడులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైనప్పటికీ పోలీసులు అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పాలకీడు గ్రామానికి చెందిన బట్ట ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని, జిల్లా ఎస్పీ గారు వెంటనే స్పందించి తనకు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తన గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. వివరాలు ఆమె మాటల్లోనే..:



**రెండుసార్లు దాడులు:**

పాలకీడు మండలం రాయపాడు గ్రామానికి చెందిన కరెంట్ లైన్‌మెన్ గడ్డం సైదులు తనను నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిపారు. గత నెల 5వ తేదీన, అలాగే ఈ నెల (జూన్) 3వ తేదీన రెండుసార్లు తనపై భౌతికంగా దాడికి పాల్పడ్డాడని వివరించారు.

**ఎస్పీ ఆదేశాలతో కేసు నమోదు:**

ఈ విషయమై మొదట పాలకీడు ఎస్ఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో, తాను జిల్లా ఎస్పీని ఆశ్రయించానని చెప్పారు. ఎస్పీ గారు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో, ఈ నెల 3వ తేదీన సైదులుపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.

**పోలీసుల నిర్లక్ష్యం - విచారణ పేరిట వేధింపులు:**

కేసు నమోదై ఇన్ని రోజులవుతున్నా నిందితుడు సైదులును పోలీసులు అరెస్టు చేయడం లేదని ఉమాదేవి ఆరోపించారు. పైగా, పాలకీడు ఎస్ఐ తనను విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి:**

బయటే స్వేచ్ఛగా తిరుగుతున్న సైదులు.. తనను కేసు విత్‌డ్రా చేసుకోవాలంటూ నిరంతరం బెదిరింపులకు గురిచేస్తున్నాడని, అతని వల్ల తన ప్రాణాలకు ముప్పు ఉందని భయాందోళన వ్యక్తం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, నిందితుడైన గడ్డం సైదులును వెంటనే అరెస్టు చేయాలని, తనకు మరియు తన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని ఆమె చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.



# మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాల పై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జూన్, 11**

మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ విసి హాల్ నందుఉపాధి హామీ పథకం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయుత పెన్షన్లలో ఫేస్ అథెంటికేషన్ త్వరగా పూర్తిచేయాలని పెన్షన్లలో అర్హులు, అనర్హుల జాబితా రిజిస్టర్లు తప్పక నిర్వహించాలని, ఎంపీడీవో లాగిన్‌లో ఉన్న పెండింగ్ వాటికి అప్రూవల్ ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సంబంధించి అన్నింటికి మరుగుదొడ్లు పూర్తి చేయాలని అలాగే కొత్తగా నిర్మించుకున్న ఇండ్లకు కూడా మరుగుదొడ్లు మంజూరు చేయాలని, గ్రామ పంచాయతీల దగ్గర ఉన్న వాటికి సామూహిక మరుగుదొడ్లు పూర్తి చేయాలని రానున్న వర్షాల దృష్ట డ్రైనేజ్, ఇంకుడు గుంతలు పూర్తి చేయాలని రాబోవు వన మహోత్సవం సందర్భంగా చెట్లు నాటడానికి స్థలాలను గుర్తించి గుంతలు తీయించాలని, పండ్ల తోటలు మునగ తోటలు పెంచు లబ్ధిదారులను గుర్తించి వారికి ఉపాధి హామీ కింద లబ్ధి చేకూరేలా చేయాలని ఉపాధి హామీ మెటీరియల్ ప్రభుత్వం నుండి విడుదలైన నిధులను పూర్తి అయిన పనులకు చెల్లింపులు చేసి నిధులు వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పి డి సన్యాసయ్య, జడ్పి సిఇఓ శిరీష, డీపీఓ యాదగిరి, అడిషనల్ డిఆర్డిఓ చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత జీవనశైలితోనే కాలుష్య నియంత్రణ సాధ్యం

## ఐఐసీటీ డైరెక్టర్

**హైదరాబాద్, జూన్ 11**

పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవడం అత్యంత ప్రభావవంతమైన మార్గమని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ ఎ. గంగాగ్ని రావు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాగ్ని రావు మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ, వాతావరణ మార్పులు, ఇంధన భద్రత వంటి సమస్యలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. జీవవ్యర్థాలను కంపోస్టింగ్, బయోమీథనేషన్ వంటి శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాసెస్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యర్థాలను పునరుత్పాదక ఇంధనంగా, సేంద్రీయ ఎరువులుగా మార్చేందుకు అనారోబిక్ డైజెషన్ సాంకేతికతలను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూనివర్సిటీ అకడమిక్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. సుధారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి, సామాజిక ప్రయోజనాలు సమన్వయంతో కూడిన సుస్థిర అభివృద్ధి అవసరమని అన్నారు. ప్లాస్టిక్ దుర్వినియోగం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని పేర్కొన్న ఆమె, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగ వస్తువులను ఉపయోగించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. పర్యావరణ హిత చర్యల్లో భాగంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇప్పటికే ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించామని, భవిష్యత్తులో కూడా పచ్చదనాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.



# ఎక్సైజ్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్

**హైదరాబాద్, జూన్ 11**

బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో నిర్వహించిన అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న నూట పదిహేడు మంది అధికారులను అభినందించిన ఆయన, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో మహిళల భాగస్వామ్యం పెరగడం మహిళా సాధికారతకు నిదర్శనమని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన అధికారుల్లో ముప్పై మూడు మంది మహిళలు ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇరవై నాలుగు మంది సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎనభై తొమ్మిది మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ ద్వారా చట్టాలపై అవగాహన, విచారణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందాయని మంత్రి పేర్కొన్నారు. అయితే అసలు పరీక్ష క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలోనే ప్రారంభమవుతుందని అన్నారు.

# కోటప్పకొండ-చీరాల బీచ్‌కు ప్రత్యేక బస్సులు

**సూర్యాపేట, జూన్ 11**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సూర్యాపేట డిపో ఆధ్వర్యంలో కోటప్పకొండ పుణ్యక్షేత్రం, చీరాల బీచ్‌లకు ప్రత్యేక ఒకరోజు విహార యాత్ర బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ ప్రత్యేక యాత్రలు జూన్ 13,14 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట డిపో నుంచి ఉదయం 4 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి కోటప్పకొండ దర్శనం అనంతరం చీరాల బీచ్ సందర్శనకు తీసుకెళ్లి, అదే రోజు రాత్రికి తిరిగి సూర్యాపేటకు చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ. 1,000, పిల్లలకు రూ. 700గా నిర్ణయించినట్లు వెల్లడించారు. సీట్ల రిజర్వేషన్, ఇతర వివరాల కోసం9951613178, 7382835445, 7382834947, 7382835457 నంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

# కాంగ్రెస్ నేతకు నివాళి

**నల్లగొండ, జూన్ 11**

నర్సింగ్ బట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మగాని సత్యనారాయణ అకాల మరణం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం సత్యనారాయణ నివాసానికి వెళ్లిన ఆయన పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బొమ్మగాని సత్యనారాయణ పార్టీ కోసం, సమాజం కోసం విశేష సేవలు అందించారని గుర్తు చేశారు.



# ఏఐ వినియోగంతో పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుంది

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యపేట జూన్ 11**

ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌లి తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, మాస్టర్ ట్రైనర్స్ వాసుదేవన్ నటరాజన్ దేవరాజ్, రాహుల్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ బస్టాండ్‌లో మంత్రి పర్యటన

**హుస్నాబాద్, జూన్ 11**

హుస్నాబాద్ బస్టాండ్‌ను రాష్ట్ర రవాణా సంస్థ నిర్వహణ సంచాలకుడు నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లోని సౌకర్యాలు, ప్రయాణికులకు అందుతున్న సేవలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి బస్సుల రాకపోకలు, మౌలిక సదుపాయాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా హుస్నాబాద్ బస్టాండ్ వరద ముప్పును ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంత్రి ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షించారు. వర్షపు నీరు బస్టాండ్‌లో నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్ వెనుక



భాగంలో ఉన్న కాలువను ప్రధాన రహదారి పక్కనున్న మురుగునీటి కాలువకు అనుసంధానం చేసేలా భూగర్భ కాలువ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. దీనివల్ల వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లి బస్టాండ్ ముంపు సమస్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఈ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రవాణా సంస్థ అధికారులు స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన పనులపై కూడా చర్చ జరిగింది. వేచి ఉండే ప్రదేశాలు, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు చిత్తరి పద్మ, కౌన్సిలర్లు, రవాణా సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. హుస్నాబాద్ బస్టాండ్ అభివృద్ధి, వరద ముప్పు నివారణ చర్యలను వేగవంతంగా అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## అంతర్జాతీయ షిప్పింగ్, లాజిస్టిక్స్ సదస్సుకు హైదరాబాద్ వేదిక

**హైదరాబాద్, జూన్ 11**

దేశ లాజిస్టిక్స్ రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ **(FTCCI)** ఆధ్వర్యంలో, వీరా లాజిస్టిక్స్ సహకారంతో అంతర్జాతీయ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కాన్ఫరెన్స్ **(ICSL-2026)**ను జూన్ 12న హైదరాబాద్‌లోని నోవోటెల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ సదస్సులో మల్టీమోడల్ లాజిస్టిక్స్, డిజిటల్ సరఫరా గొలుసులు, ఈ-కామర్స్ ఫుల్‌ఫిల్మెంట్, గిడ్డంగుల నిర్వహణ, ఎలక్ట్రిక్ వాహనాల ఆధారిత లాజిస్టిక్స్, కృత్రిమ మేధస్సు **(AI)**, ఆటోమేషన్, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. దేశాన్ని ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు విధానపరమైన చర్చలు, పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీఓ, తహసీల్దార్, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

**హైదరాబాద్, జూన్ 11**

ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించేందుకు రాష్ట్రంలోని ఆర్డీఓ, తహసీల్దార్, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార-ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో లేదా శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల వివరాలను సేకరించినట్లు తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో లేదా అనుకూల సౌకర్యాలు లేని ప్రదేశాల్లో పనిచేస్తున్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీఓ కార్యాలయాలకు ఆధునిక సదుపాయాలతో కూడిన శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సముచితం కాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో భవనాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

## హిల్ రిడ్జ్ విల్లాల చోరీ కేసు ఛేదన

### రూ. కోట్ల విలువైన బంగారం స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 11**

గచ్చిబౌలిలోని విలాసవంతమైన హిల్ రిడ్జ్ విల్లాలలో జరిగిన భారీ చోరీ కేసును సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. కేసులో భాగంగా సుమారు 7.84 కిలోల బంగారు ఆభరణాలు, 1.36 కిలోల వెండి వస్తువులు, నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూన్ 7న ఓ వృద్ధ దంపతులు ఇంటికి తిరిగి వచ్చి దేవుడి విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం లాకర్‌ను తనిఖీ చేయగా 7 నుంచి 8 కిలోల బంగారు నగలు, 1.5 కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ప్రత్యేక ఆపరేషన్ బృందాలు ఉత్తరప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో గాలింపు చేపట్టి జూన్ 9న ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లాలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశాయి. అరెస్టైన వారిలో నేపాల్‌కు చెందిన కమల్ షాహీ (32), అతని భార్య విమ్లా షాహీ అలియాస్ బిమలా షాహీ, కల్పనా షాహీ (26) ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ ముఠా విలాసవంతమైన ఇళ్లలో గృహ సేవకులుగా ఉద్యోగాలు సంపాదించి, ఇంటి యజమానుల దినచర్యలను గమనించి చోరీలకు పాల్పడేది. ప్రధాన నిందితుడు సురేష్ అలియాస్ సూరజ్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించి, మొత్తం సొత్తును తిరిగి స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేశ్ అభినందించారు. కేసు దర్యాప్తులో పాల్గొన్న సిబ్బందికి నగదు బహుమతులు ప్రకటించారు.

## కేంద్ర పథకాలు తెలంగాణలో సమర్థంగా అమలు చేయాలి

### గవర్నర్‌కు ఎమ్మెల్సీ కొమురయ్య వినతి

**హైదరాబాద్, జూన్ 11**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరారు. లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన కొమురయ్య, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, సాయిల్ హెల్త్ కార్డ్ పథకం సహా సుమారు 22 కేంద్ర పథకాలు రాష్ట్రంలో సమర్థంగా అమలు కావడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో కరువు, అధిక వర్షాలు వంటి ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతులు పరిహారం పొందలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర పథకాలన్నీ తెలంగాణలో పూర్తి స్థాయిలో అమలయ్యేలా గవర్నర్ జోక్యం చేసుకోవాలని కొమురయ్య విజ్ఞప్తి చేశారు.



సీతారామ సాగర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై జలసౌధలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

# సీతారామ ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలి

### ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 11**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. భూసేకరణ, పునరావాసం (ఆర్ అండ్ ఆర్), అటవీ, పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రతిపాదనలను వెంటనే జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు పంపించి నిర్ణీత గడువులోగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక-ఆర్థిక అనుమతులు లభించాయని అధికారులు మంత్రికి వివరించారు. రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందడంలో జాప్యం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మిగిలిన పర్యావరణ అనుమతులను త్వరగా సాధించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన కోర్టు కేసులపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు సహా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను నిశితంగా పరిశీలించాలని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైతే అదనపు అడ్వకేట్ జనరల్‌ను ఢిల్లీలో నియమించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ, సాగునీటి రంగం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని మంత్రి స్పష్టం చేశారు. గోదావరి జలాలను సీతారామ ప్రాజెక్టు ద్వారా ఎన్ఎస్‌పీ ఎడమ కాలువ వ్యవస్థకు అనుసంధానం చేసి పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మళ్లించే అంశానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. భూసేకరణ పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని, అటవీ అనుమతులను జూలై నెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు--పాలేరు లింక్ కాలువకు అవసరమైన భూసేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా సీతారామ ప్రాజెక్టు ప్యాకేజీ-1 నుంచి ఎల్లందు నియోజకవర్గంలోని బయ్యారం ఎగువ గిరిజన ప్రాంతాలకు నీటిని ఎత్తిపోసే ప్రతిపాదనకు సూత్రప్రాయ ఆమోదం తెలిపారు. దీనిపై ఆచరణ సాధ్యమైన, వ్యయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్న సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలం డివిజన్‌లో తలెత్తుతున్న ముంపు సమస్యలపై త్వరలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మరో పక్షం రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా సందర్శించి పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.

## ఫోన్ చోరీల ముఠా అరెస్ట్

**సూర్యాపేట, జూన్ 11**

బస్సుల్లో ప్రయాణించే వారి మొబైల్ ఫోన్లను దొంగిలించి, వాటిలోని యూపీఐ, మనీ యాప్‌ల ద్వారా నగదు అపహరిస్తున్న ముఠాను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.2.70 లక్షల నగదు, 27 స్మార్ట్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహ కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల ఉప్పలయ్య గత నెలలో బస్సు ప్రయాణ సమయంలో మొబైల్ ఫోన్‌ను కోల్పోయారు. అనంతరం ఫోన్‌లోని డిజిటల్ చెల్లింపు యాప్‌లను వినియోగించి ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ.1.80 లక్షలు అపహరించారు. అదే విధంగా తుంగతుర్తికి చెందిన వ్యాపారి దుగ్యాల వెంకటేశ్వరరావు మొబైల్ ఫోన్ దొంగిలించి, అతని ఖాతా నుంచి సుమారు రూ.90 వేల నగదును మోసపూరితంగా బదిలీ చేశారు. బాధితుల ఫిర్యాదుల మేరకు తుంగతుర్తి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు తుంగతుర్తి బస్టాండ్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించి ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు ఇద్దరు బాల న్యాయవిధి పరిధిలోని వ్యక్తులను గుర్తించారు. నిందితులు బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల మొబైల్ ఫోన్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఫోన్లలోని డిజిటల్ చెల్లింపు యాప్‌ల ద్వారా వివిధ ఖాతాలకు నగదు బదిలీ చేసి దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసులో అపహరణకు గురైన మొత్తం రూ.2.70 లక్షల నగదును రికవరీ చేయడంతో పాటు 27 సెల్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. రైతు, వ్యాపారికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పోలీసులు వేగంగా దర్యాప్తు నిర్వహించి కేసును ఛేదించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎస్పీ పలు సూచనలు చేశారు. మొబైల్ ఫోన్లకు, యూపీఐ, డిజిటల్ చెల్లింపు యాప్‌లకు బలమైన పాస్‌వర్డ్లు, పిన్ నంబర్లు ఉపయోగించాలని, సులభంగా ఊహించగలిగే సంఖ్యలను ఉపయోగించవద్దని సూచించారు.





## వరి కొయ్యల దహనం..

**ఆత్మకూర్ (ఎస్), జూన్ 11**

పంట కోతల అనంతరం వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యానికి, భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని వ్యవసాయ, పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ, కొందరు రైతులు ఈ హెచ్చరికలను పట్టించుకోకుండా వరి అవశేషాలను దహనం చేస్తున్నారు. ఆత్మకూర్ మండలం దుబ్బ తండాలో ఇటీవల వరి కొయ్యలను తగులబెట్టిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వరి కొయ్యలను దహనం చేయడం వల్ల వెలువడే పొగ, విషవాయువులు గాలి నాణ్యతను దెబ్బతీసి శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది మరింత ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా వరి అవశేషాల దహనం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు, సేంద్రియ పదార్థాలు నశించి నేల సారవంతత తగ్గిపోతుంది. దీని ప్రభావం భవిష్యత్తులో పంట దిగుబడులపై కూడా పడే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తక్షణ ప్రయోజనం కోసం చేపడుతున్న ఈ చర్య దీర్ఘకాలంలో రైతులకే నష్టాన్ని కలిగిస్తుందని వారు సూచిస్తున్నారు. రైతులకు గ్రామ సభలు, రైతు వేదికలు, పొలం స్థాయి అవగాహన కార్యక్రమాల ద్వారా వరి కొయ్యల దహనం వల్ల కలిగే అనర్థాలపై అధికారులు పలుమార్లు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.5 వేల వరకు జరిమానాలు కూడా విధిస్తున్నారు. అయినప్పటికీ కొంతమంది రైతులు ఈ చర్యలను కొనసాగించడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయ అవశేషాలను తగులబెట్టకుండా సేంద్రియ ఎరువుల తయారీ, పశువుల మేత, మల్చింగ్, బయోకంపోస్టింగ్ వంటి ప్రత్యామ్నాయ పద్ధతులకు వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఎస్‌డబ్ల్యూఎఫ్‌తోనే ఆర్టీసీ కార్మికులకు న్యాయం

### బత్తుల సుధాకర్

**సూర్యాపేట డిపో విస్తృత స్థాయి సమావేశంలో రీజియన్ కార్యదర్శి పిలుపు**

**సూర్యాపేట: జూన్ 11**

కార్మికుల వారధి – పోరాటాల సారథి అయిన స్టాఫ్ ఓ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ద్వారానే ఆర్టీసీ కార్మికులకు అసలైన న్యాయం జరుగుతుందని ఆ సంఘం రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు కందుల నరసింహ, బత్తుల సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు. ఆర్టీసీ సంస్థ పట్ల, కార్మికుల సమస్యల పట్ల స్పష్టమైన అవగాహనతో, పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఏకైక సంఘం ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాత్రమేనని వారు స్పష్టం చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట డిపో విస్తృత స్థాయి సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

**రాజీలేని పోరాటాల సంఘం 'ఎస్ డబ్ల్యూ ఎఫ్'**

సమావేశంలో రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం, సంస్థ మనుగడ కోసం ఎస్ డబ్ల్యూ ఎఫ్ మొదటి నుండి రాజీలేని పోరాటాలు చేస్తోందని గుర్తుచేశారు. నీతి, నిజాయితీతో పనిచేస్తున్న తమ సంఘానికి కార్మికులందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



"కార్మికుల ఉద్యోగ భద్రత కోసం ఎన్నో ఏళ్లుగా ఎస్ డబ్ల్యూ ఎఫ్ కృషి చేస్తోంది. అనేక సదస్సులు నిర్వహించి, ప్రభుత్వానికి, యాజమాన్యానికి వ్యతిరేకంగా కోర్టుల వరకు వెళ్లి పోరాడిన ఘనత మా సంఘానిదే." అధ్యయనం లేకుండా విలీనం కోరడం విడ్డూరం! గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న ప్రకటనపై ఎస్ డబ్ల్యూ ఎఫ్ బాధ్యతాయుతంగా వ్యవహరించిందని నేతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి అక్కడి విలీన ప్రక్రియ వల్ల కార్మికులకు జరిగే లాభనష్టాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, ఒక 'విలీన బుక్‌లెట్'ను ముద్రించినట్లు పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు ఈ బుక్‌లెట్‌ను చదివి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. ఆర్టీసీలోని కొన్ని సంఘాలు కార్మికులకు జరిగే నష్టాలను అంచనా వేయకుండా, ఉన్న సమస్యలను పరిష్కరించకుండా గుడ్డిగా విలీనం చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

**తెలంగాణ సెంటిమెంట్‌తో మళ్లీ మోసం చేసేందుకు యత్నం**

గత ప్రభుత్వం యూనియన్లను నిషేధించినప్పుడు ఏ ఒక్క సంఘం కూడా కార్మికుల కష్టాలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సమ్మె చర్చల సందర్భంగా యూనియన్ల పునరుద్ధరణ, ఎన్నికల నిర్వహణ ప్రస్తావన రాగానే కొన్ని సంఘాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయని విమర్శించారు. మళ్లీ 'తెలంగాణ సెంటిమెంట్'ను అడ్డం పెట్టుకొని గుర్తింపు పొందాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు గుర్తింపులో ఉండి, రెండు పీఆర్‌సీలను ఎగ్గొట్టి, కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిన సంఘాలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతాయని కార్మికులే ప్రశ్నిస్తున్నారని వారు పేర్కొన్నారు.

**ఎస్ డబ్ల్యూ ఎఫ్ లో భారీగా చేరికలు**

ఈ సమావేశంలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ విధానాలకు ఆకర్షితులై వివిధ సంఘాల నుండి పలువురు కార్మికులు పెద్ద సంఖ్యలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ముఖ్యంగా కార్మిక నాయకులు నాగరాజు, లింగయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు. వీరికి రీజియన్ నాయకులు ఎస్ డబ్ల్యూ ఎఫ్ కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో రీజియన్ సహాయ కార్యదర్శి శ్యాం సుందర్, రీజియన్ ఉపాధ్యక్షులు గుండు రమేష్, కోదాడ డిపో కార్యదర్శి సోమయ్య, డిపో అధ్యక్ష, కార్యదర్శులు రవి, లక్ష్మయ్య, మహిళా కన్వీనర్ యాకమ్మ, ఎలేంద్ర, డిపో కోశాధికారి వేల్పుల వెంకన్న, ఎస్.ఎం. రెడ్డి, మర్యాద వెంకన్న, శంకర్, వీరసోములు, వెంకన్న, అజయ్, ప్రవీణ్ కుమార్, శంకరయ్య, రంగు వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు

**వన్డే, టీ20ల్లో అగ్రస్థానం పదిలం**

ముంబై -- 11-06-2026 -- :

అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన వార్షిక ర్యాంకింగ్స్ నవీకరణలో భారత జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. పురుషుల వన్డే, టీ20 ఫార్మాట్లలో ప్రపంచ నంబర్-1 జట్టుగా భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ 118 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ జట్టు 113 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తోంది. గతంతో పోలిస్తే రెండు జట్ల మధ్య ఉన్న పాయింట్ల తేడా తగ్గడంతో అగ్రస్థాన పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియా జట్టు 109 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. తొలి మూడు స్థానాల్లో ఎలాంటి మార్పులు లేకపోయినా, తరువాతి స్థానాల్లో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దక్షిణాఫ్రికా జట్టు 102 పాయింట్లతో ఒక స్థానం మెరుగుపరుచుకుని



నాలుగో స్థానానికి చేరుకుంది. దీంతో పాకిస్తాన్ జట్టు 98 పాయింట్లతో ఐదో స్థానానికి పడిపోయింది. ఈ మార్పు తాజా ర్యాంకింగ్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దిగువ స్థానాల్లో కూడా కొన్ని ఆసక్తికర మార్పులు చోటుచేసుకున్నాయి. ఐర్లాండ్ జట్టు జింబాబ్వేను వెనక్కి నెట్టి 11వ స్థానానికి చేరుకోగా, అమెరికా జట్టు స్కాట్లాండ్‌ను అధిగమించి 13వ స్థానంలో నిలిచింది. ఇక టెస్టు క్రికెట్ విష యానికి వస్తే ఆస్ట్రేలియా జట్టు అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. సు దీర్ఘ ఫార్మా ట్‌లో ఆస్ట్రేలియా ఆధిపత్యం కొన సాగుతుండగా, భారత్ పరిమి త ఓవర్ల క్రికెట్‌లో తన బలాన్ని మరో సారి నిరూ పిం చింది. మహిళల క్రికెట్‌లో కూడా ఆస్ట్రేలి యా జట్టు తన ఆధి పత్యాన్ని కొనసా గిస్తోంది. మహిళల వన్డే, టీ20 ఫార్మాట్లలో ఆస్ట్రేలియా ప్రపంచ నంబర్-1 జట్టుగా నిలిచింది. తాజా ర్యాం కింగ్స్‌తో ప్రపంచ క్రికెట్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్ల ఆధిపత్యం మరోసారి స్పష్టమైందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆఫ్ఘన్ చేతిలో భారత్‌కు షాక్ డీఎల్ఎస్‌తో ఓటమి

ముంబై -- 11-06-2026 -- :

ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ జట్టుకు అఫ్ఘనిస్తాన్-ఏ జట్టు షాక్ ఇచ్చింది. వర్షం కారణంగా పలుమార్లు అంతరాయం ఏర్పడిన మ్యాచ్‌లో డక్వర్త్-లూయిస్-స్టెర్న్ విధానం ప్రకారం అఫ్ఘనిస్తాన్-ఏ నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు 49 ఓవర్లలో 349 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ప్రభుసిమ్రన్ సింగ్ 84 పరుగులతో రాణించగా, తిలక్ వర్మ 66, రుతురాజ్ గైక్వాడ్ 66 పరుగులు చేశారు. యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ 44 పరుగులతో వేగవంతమైన ఆరంభాన్ని అందించాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఓవర్లు కుదించడంతో అఫ్ఘనిస్తాన్-ఏకు 38 ఓవర్లలో 294 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. లక్ష్య ఛేదనలో అఫ్ఘన్ బ్యాటర్లు ధైర్యంగా ఆడుతూ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోయే సమయానికి అఫ్ఘనిస్తాన్-ఏజట్టు 25.5 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది.



డక్వర్త్-లూయిస్-స్టెర్న్ లెక్కల ప్రకారం ఆసమయంలో అఫ్ఘన్ జట్టు నాలుగు పరుగుల ఆధిక్యంలో ఉండటంతో విజేతగా ప్రకటించారు. అఫ్ఘనిస్తాన్ తర ఫున ఇమ్రాన్ అజేయంగా 75 పరుగులు చేయగా, ఐహార్ షా 51 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. ఈ ఇద్దరు మూడో వికె ట్‌కు అజేయంగా 108 పరు గుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయానికి చేరువ చేశారు. భారీ స్కోరు చేసినప్పటికీ వర్షం కారణంగా భారత్-ఏకు అదృష్టం కలిసి రాలేదు. అఫ్ఘన్ బ్యాటర్ల పోరాటంతో భారత్-ఏ జట్టుకు అనూహ్య ఓటమి ఎదురైంది. ఈ విజయంతో అఫ్ఘనిస్తాన్-ఏ జట్టు సిరీస్‌లో కీలక విజయం నమోదు చేసింది.

# 2027 ప్రపంచకప్‌కు రోహిత్ కోహ్లీ రైనా అభిప్రాయం

ముంబై -- 11-06-2026 -- :

2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవం ఎంతో కీలకమని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డారు. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు అండగా ఉంటే జట్టు మరింత బలంగా మారుతుందని పేర్కొన్నారు. పెద్ద టోర్నీల్లో అనుభవం అత్యంత ముఖ్యమని రైనా చెప్పారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే అరవై ఓవర్ల, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికి ప్రస్తుతం వన్డేలపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ప్రపంచకప్‌లలో ఈ ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. 2019 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యధిక పరుగులు సాధించగా, 2023 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ టోర్నీ అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడని రైనా వివరించారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్వహించే ప్రధాన టోర్నీల్లో విజయం సాధించిన అనుభవం వారికి ఉందని, కీలక నాకౌట్ మ్యాచ్‌ల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసని చెప్పారు. అలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం యువ క్రికెటర్లకు కూడా ఎంతో ఉపయోగకరమని రైనా అభిప్రాయపడ్డారు. శుభ్‌మన్ గిల్ తొలిసారి



ప్రపంచకప్‌లో భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో రోహిత్, కోహ్లీ సలహాలు అతడికి ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. ఇదే సమయంలో మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే కూడా గిల్‌పై ప్రశంసలు కురి పించారు. నాయకత్వ బాధ్యతలు వచ్చినప్పటికీ గిల్ బ్యాటింగ్‌పై ఎలాంటి ప్రభావం పడలేదని అన్నా డు. ఇటీవల జరిగిన లీగ్ పోటీల్లో కూడా అతడు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ అద్భుత ప్రదర్శన చేశాడని కొనియాడారు. గిల్‌కు అనుభవజ్ఞులైన ఆటగాళ్ల మద్దతు ఉండటం పెద్ద బలమని కుంబ్లే పేర్కొన్నారు. రోహిత్, కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలో ఉండటం వల్ల ఫీల్డింగ్ అమరికలు, బౌలింగ్ మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాల్లో యువ కెప్టెన్‌కు సహకారం అందుతుందని చెప్పారు. అందువల్ల నాయకత్వ బాధ్యతల భారం పూర్తిగా గిల్‌పైనే పడదని, సీనియర్ల అనుభవం భారత జట్టుకు 2027 ప్రపంచకప్‌లో కీలకంగా మారే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## ప్రపంచకప్‌కు వీడ్కోలు చెప్పనున్న దిగ్గజాలు

# ఇదే చివరి పోరు

ముంబై -- 11-06-2026 -- :

ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రారంభానికి రంగం సిద్ధమవుతున్న వేళ ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ మెగా టోర్నీ కేవలం ప్రపంచ విజేతను నిర్ణయించడమే కాకుండా ఓ స్వర్ణయుగానికి ముగింపు పలకనుంది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ ఫుట్‌బాల్‌ను శాసించిన పలువురు దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్‌గా నిలిచే అవకాశం ఉంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఇప్పటికే ప్రపంచకప్ గెలిచి తన కలను సాకారం చేసుకున్నాడు. 2022లో జట్టుకు టైటిల్ అందించిన మెస్సీ, ఇప్పుడు వరుసగా రెండోసారి అర్జెంటీనాను విజేతగా నిలపాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాడు. ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన మెస్సీకి ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు మాత్రం ప్రపంచకప్ ఇంకా అందని కలగానే మిగిలిపోయింది. ఎన్నో రికార్డులు, ట్రోఫీలు గెలిచిన రొనాల్డో తన కెరీర్‌లో ప్రపంచకప్‌ను మాత్రమే అందుకోలేకపోయాడు. 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న అతనికి ఈ టోర్నీ చివరి అవకాశం కానుంది. క్రొయేషియా దిగ్గజం



లూకా మోడ్రిచ్ కూడా తన చివరి ప్రపంచకప్ ఆడనున్నాడు. 2018 లో జట్టు ను ఫైనల్‌కు చేర్చిన మోడ్రిచ్, ఇ ప్పటికీ క్రొ యేషియా జట్టుకు కీలక శక్తి గా కొనసా గుతున్నాడు. ఈ టోర్నీ తో అతని అద్భుతమైన అంత ర్జాతీయ కెరీర్ ముగిసే అవకా శం ఉంది. జర్మనీ స్టార్ థామస్ ముల్లర్ కూడా చివరిసారి ప్రపంచకప్ వేదికపై కని పించనున్నాడు. 2014లో జర్మనీ విజయంలో కీలక పాత్ర పోషించిన ముల్లర్, తన అనుభవంతో మరోసారి జట్టుకు సేవలందించేందుకు సిద్ధమయ్యాడు. బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని సంకేతాలు ఇచ్చాడు. బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచిన నెయ్‌మార్, ఆరో ప్రపంచకప్ టైటిల్‌ను దేశానికి అందించాలనే లక్ష్యంతో చివరిసారి బరిలోకి దిగనున్నాడు. మెస్సీ, రొనాల్డో, మోడ్రిచ్, ముల్లర్, నెయ్‌మార్ వంటి దిగ్గజాల కోసం ఈ ప్రపంచకప్ మరింత ప్రత్యేకంగా మారింది. ప్రపంచ విజేత ఎవరో తేలడమే కాకుండా, ఫుట్‌బాల్ చరిత్రలో ఓ గొప్ప తరం ఆటగాళ్లకు వీడ్కోలు పలికే వేదికగా కూడా ఈ టోర్నీ నిలవనుంది.

# వింబుల్డన్‌లో రికార్డు బహుమతి విజేతకు రూ.40 కోట్లు

ముంబై -- 11-06-2026 -- :

ప్రపంచ ప్రఖ్యాత వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో ఈసారి రికార్డు స్థాయిలో బహుమతి నగదును ప్రకటించారు. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 48 లక్షల డాలర్ల బహుమతి అందించనుండగా, ఇది భారత కరెన్సీలో సుమారు రూ.40 కోట్లకు సమానం. టోర్నీ తొలి రౌండ్ లోనే ఓడిపోయిన ఆటగాళ్లకు కూడా కనీసంగా 80 వేల పౌండ్ల పారితోషికం అందించనున్నారు. అర్హత పోటీల కోసం సుమారు 60 లక్షల పౌండ్లను కేటాయించిన నిర్వాహకులు, గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెంపు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మొత్తం బహుమతి నగదు 64.2 మిలియన్ పౌండ్లకు చేరుకుంది. వింబుల్డన్ చరిత్రలోనే ఇదే అత్యధిక బహుమతి నగదని నిర్వాహకులు వెల్లడించారు.



ఆల్ ఇంగ్లండ్ క్లబ్ చైర్ డెబోరా జీవన్స్ మాట్లాడుతూ ఆటగాళ్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రౌండ్లలోనూ పారి తోషికాలను పెంచినట్లు తెలిపారు. టోర్నీ ఆదాయంలో మరింత వాటా ఆటగాళ్లకు ఇవ్వాలన్న డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో బహుమతి నగదు 9.5 శాతం పెరిగినప్పటికీ, పలువురు ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు నిరసనలు కూడా చేపట్టారు. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో బహుమతి నగదు 20 శాతం పెంచగా, ఈ ఏడాది వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. గత ఏడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విభాగంలో జానిక్ సిన్నర్ విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ టైటిల్ కైవసం చేసుకుంది. ఈసారి రికార్డు స్థాయి బహుమతులతో వింబుల్డన్ మరింత ఆసక్తికరంగా మారనుంది.



## 350 పరుగుల లక్ష్యం ఆఫ్ఘన్ ముందు భారత్

# భారీ స్కోరు

ముంబై -- 11-06-2026 -- :

ముక్కోణపు సిరీస్‌లో భాగంగా అఫ్ఘనిస్తాన్-ఏ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 349 పరుగులు చేసింది. దీంతో అఫ్ఘనిస్తాన్-ఏ జట్టు విజయానికి 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచిన అఫ్ఘని స్తాన్-ఏ జట్టు ముందుగా భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించిం ది. ఇన్నిం గ్స్ ఆరంభం నుంచే యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై ఎదు రుదాడికి దిగాడు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినప్పటికీ అనూహ్యంగా ఔటయ్యాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 84 పరుగులు సాధించాడు. మధ్య వరుసలో రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు బలమైన పునాది వేశారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును ముందుకు నడిపించారు. చివర్లో సూర్యాంశ్ షెడ్గే వేగంగా పరుగులు సాధించి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. 27 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టు స్కోరు బోర్డును పరుగెత్తించాడు.

## ఆస్ట్రేలియా జట్టులో భారత క్రికెటం 60 ఏళ్ల

# తర్వాత అరుదైన ఘనత

ముంబై -- 11-06-2026 -- :

భారత సంతతికి చెందిన క్రికెటర్ నిఖిల్ చౌదరి ఆస్ట్రేలియా జాతీయ జట్టులో చోటు దక్కించుకుని అరుదైన ఘనత సాధించాడు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన నిఖిల్, తుది జట్టులో అవకాశం దక్కితే వచ్చే వారం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరఫున అరంగేట్రం చేయను న్నాడు. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత భారత మూలాలు కలిగిన ఓ పురుష క్రికెటర్ ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో ఈ ఎంపిక కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం నిఖిల్ హోబార్ట్ హరికేన్స్ జట్టు తరఫున దేశీయ క్రికె ట్ ఆడుతున్నాడు. ఇటీవల బెల్జియంలో జరుగుతున్న ఆయూ 20 పోటీల్లో జేబీ బ్రూగ్స్ జట్టు తరఫున కూడా అతను ప్రాతి నిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి స్పిన్ బౌలర్‌గా గుర్తింపు పొందిన నిఖిల్ అవసరమైన సమయంలో విలువైన పరుగులు చేయగల సమర్థుడైన బ్యాటర్ కూడా. బంగ్లాదేశ్‌తో జూన్ 17 నుంచి 21 వరకు జరిగే టీ20 సిరీస్‌లో మధ్య వరుస స్థానం కోసం జోయెల్ డేవిస్, ఆరన్ హార్డీతో నిఖిల్ పోటీ పడనున్నాడు.



## ద్రవిడ్ వారసుడు టీమిండియాలో అన్వయ్‌కు

# అండర్-19 పిలుపు

ముంబై -- 11-06-2026 :

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవి డ్ కుటుంబం నుంచి మరో క్రికెట ర్ జాతీయ జట్టులోకి అడుగు పెట్టను న్నాడు. ద్రవిడ్ చిన్న కుమారు డు, వికె ట్ కీపర్ బ్యాటర్ అన్వయ్ ద్రవిడ్‌కు భార త అండర్-19 జట్టులో చోటు దక్కింది. వచ్చే నెల శ్రీలంక పర్యటనకు ఎంపికైన జట్టులో అతనికి అవకాశం కల్పించారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి శ్రీలంక పర్యటన కోసం అండర్-19 జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ నాయకత్వం వహించనున్నాడు. జూలై 4 నుంచి ప్రారంభమయ్యే ఈ పర్యటనలో భారత్-19 జట్టు శ్రీలంకతో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడనుంది. వన్డే జట్టులో ఎంపికైన ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లలో అన్వయ్ ద్రవిడ్ ఒకడు. గతంలో కూడా భారత అండర్-19 స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన అన్వయ్, దేశీయ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో మరోసారి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. గత ఏడాది అఫ్గానిస్తాన్ అండర్-19 జట్టుతో జరిగిన సిరీస్‌లో భారత 'బి' జట్టు తరఫున అన్వయ్ ఆడాడు. తాజాగా దేశీయ పోటీల్లో మెరుగైన ఆటతీరుతో జాతీయ జట్టులో తిరిగి స్థానం సంపాదించుకున్నాడు. అండర్-19 వన్డే జట్టులో సాగర్ విర్క్, యశ్వర్ధన్ సింగ్ చౌహాన్, లక్ష్య రాయచందాని, వినీత్ వీకే, అర్జున్ రాజ్‌పుత్, కుషాగ్రా ఓజా, రజత్ బఘేల్, అన్వయ్ ద్రవిడ్, అన్మోల్జీత్ సింగ్, పుట్టూరి యశ్వీర్ గౌడ్ తదితరులు చోటు దక్కించుకున్నారు.




### పెది చరణ్ కెరీర్‌లో మరో

# మైలురాయి

హైదరాబాద్ -- 11-06-2026

రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన భారీ క్రీడా నేపథ్య చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద వసూళ్ల ప్రభంజనం సృష్టిస్తోంది. 'ఉప్పెన' చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు బుచ్చి బాబు సానా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ భావోద్వేగ క్రీడా యాక్షన్ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. విడుదలకు ముందే ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొనగా, ప్రత్యేక ప్రదర్శనల నుంచే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. తొలి ప్రదర్శన నుంచే సానుకూల స్పందన రావడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి ప్రారంభ వసూళ్లు నమోదు చేసింది. అదే జోరును కొనసాగిస్తూ తొలి వారాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. వసూళ్ల పరంగా 'పెద్ది' కొత్త రికార్డులను నమోదు చేస్తోంది. తొలి వారంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 345 కోట్ల స్థూల వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. రామ్ చరణ్ ఒంటరి కథానాయకుడిగా నటించిన చిత్రాల్లో ఇదే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం రూ. 400 కోట్ల మార్కు దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు లభిస్తున్నాయి.



### సూర్య 50కు అనిల్ రావిపూడి ఇండస్ట్రీలో జోరుగా

# ప్రచారం

హైదరాబాద్ -- 11-06-2026.

తమిళ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్నారు. ఇటీవల విడుదలైన 'కరుప్పు' చిత్రం ఘన విజయం సాధించడంతో ఆయన తదుపరి ప్రాజెక్టులపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రీకరణను పూర్తి చేసిన సూర్య, ఈ చిత్రాన్ని ఆగస్టు 14న ప్రేక్ష కుల ముందుకు తీసుకురావడానికి సన్నా హాలు చేస్తున్నారు. ఈ సినిమా విడుదల అనం తరం సూర్య తన 47వ చిత్రాన్ని దర్శకు డు జీతూ మాధవన్‌తో ప్రారంభించ నున్నట్లు సమాచారం. అలాగే ప్రముఖ దర్శకులు పా రంజిత్, టి.జె. జ్ఞానవేల్‌లతో కూడా ఆయన సినిమాలు చేయనున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ప్రస్తుతం సూర్య సినీ ప్రయాణంలో అత్యంత ప్రతిష్టాత్మ కమైన 50వ చిత్రానికి సంబంధించిన వార్తలు ఎక్కువగా వినిపి స్తున్నాయి. సినీ వర్గాల సమాచారం ప్రకా రం, ఈ మైలురాయి చిత్రాన్ని ప్రముఖ తెలుగు దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించే అవకా శాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అనిల్ రావిపూడి చెప్పిన ఒక వినూత్నమైన వాణిజ్య కథాంశం సూర్యకు ఎంతో నచ్చిందని, అందు కేతన 50వ చిత్రాన్ని ఆయన చేతుల్లో పెట్టా లని భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రేజీ కల యికకు సంబంధించిన చర్చలు కూడా చివరి దశకు చేరుకున్నాయని సినీ వర్గాలు చెబుతు న్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.





### హిట్లు వస్తున్నా స్టార్‌డమ్ దూరం శాన్వి

# మేఘన కథ ఇదే

హైదరాబాద్ -- 11-06-2026

తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిభ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కని నటీమణుల్లో శాన్వి మేఘన ఒకరు. వరుస విజయవంతమైన చిత్రాల్లో నటించినప్పటికీ ఆమెకు రావాల్సిన స్థాయిలో స్టార్‌డమ్ ఇంకా రాలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. హైదరాబాద్‌లో జన్మించిన శాన్వి మేఘన 2019లో విడుదలైన 'సైరా నరసింహారెడ్డి' చిత్రంతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం 'పిట్ట కథలు', 'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్', 'పుష్పక విమానం', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ముఖ్యంగా 'పుష్పక విమానం' చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. తెలుగుతో పాటు తమిళ చిత్ర పరిశ్రమలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకున్న శాన్వి, అక్కడ 'కుటుంబస్థాన్' చిత్రంతో విజయాన్ని అందుకున్నారు. ఇటీవల 'టుక్ టుక్' చిత్రంతో మరోసారి ప్రేక్షకులను పలకరించారు. ఆమె నటించిన పలు చిత్రాలు విజయవంతమైనప్పటికీ, వ్యక్తిగతంగా ఆమెకు పెద్ద స్థాయి గుర్తింపు మాత్రం ఇంకా దక్కలేదు. నటిగా మంచి ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ, అగ్ర కథానాయికల సరసన నిలిచే అవకాశాలు ఇంకా రావాల్సి ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమా పరిశ్రమలో విజయవంతమైన చిత్రాల్లో నటించడం మాత్రమే కాకుండా, ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని సంపాదించుకోవడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతుంటారు. శాన్వి మేఘన విషయంలో అదే అంశం కొంత వెనుకబడినట్లు కనిపిస్తోంది. అయితే నటనపై ఆమెకున్న అంకితభావం, పాత్రల ఎంపికలో చూపు తున్న వైవిధ్యం చూస్తుంటే భవిష్యత్తులో మరిన్ని పెద్ద అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చే అవకాశం ఉందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉన్న శాన్వి మేఘన, నటనతో పాటు గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

### ది ప్యారడైజ్ పై కొత్త ప్రచారం రెండు భాగాలుగా

# రానుందా

హైదరాబాద్ -- 11-06-2026

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన నాటి నుంచే సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాపై తాజాగా పలు ఆసక్తికర ప్రచారాలు సినీ వర్గాల్లో వినిపి స్తున్నాయి. సాధారణంగా నాని చిత్రాలు వేగంగా పూర్తవుతుంటాయి. అయితే 'ది ప్యారడైజ్' విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపి స్తోంది. అనుకున్న సమయానికి చిత్రీక రణ పూర్తికాకపోవడంతో అభిమానులు ఆశ్చ ర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభ మైనప్పటి నుంచి నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తో పాటు ప్రధాన తారాగణం అంతా పూర్తిగా ఈ సినిమాపైనే దృష్టి సారించినప్పటికీ చిత్రీక రణ ఇంకా కొనసాగుతుండటం చర్చకు దారి తీసింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమా చారం ప్రకారం, గత కొన్ని నెలలుగా నిరంత రాయం గా చిత్రీకరణ జరుగుతున్నప్పటికీ ఇంకా ముఖ్యమైన సంభాషణల భాగాలు, భారీ యా క్షన్ సన్నివేశాల చిత్రీకరణ మిగిలి ఉన్నట్లు తెలు స్తోంది.



### వరలక్ష్మి కంప్లైంట్ వివాదమే

# కారణమా

హైదరాబాద్ -- 11-06-2026.

నటి వరలక్ష్మి శరత్‌కుమార్, దర్శకుడు సంజీవ్ మేగోటి మధ్య నెలకొన్న వివాదం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విడుదలకు సిద్ధంగా ఉన్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రం చుట్టూ ప్రారంభమైన ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. సినిమా విడుదలకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో దర్శకుడు సంజీవ్ మేగోటి చేసిన వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. అనంతరం వరలక్ష్మి శరత్‌కుమార్ తన సామాజిక మా ధ్యమ ఖాతాలో చేసిన ఒక పోస్ట్ మరింత ఆసక్తిని రేకెత్తించింది. "మొరిగే కుక్కలు కరవ వు.. కరిచే కుక్కలు మొరగవు.. నేను మొంగను.. కరుస్తాను" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఈ పోస్ట్ ఎవ రిని ఉద్దేశించి చేశారనే విషయంపై ఎలాంటి అధికారిక స్పష్టత లేకపోయినా, దర్శకుడి వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే ఈ సందేశం పెట్టినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జూన్ 12న విడుదల కానున్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో నటించారు. భయానక యాక్షన్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రంపై చిత్రబృందం భారీ ఆశలు పెట్టుకుంది. అయితే ప్రచార కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ, సినిమా రెండో భాగానికి సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేయడానికి వరలక్ష్మి మూడు నెలల సమయం తీసుకున్నారని ఆరోపించారు.





### అల్లు అర్జున్ ఎదుగుదల అద్భుతం వడ్డే నవీన్

# ప్రశంసలు

హైదరాబాద్ -- 11-06-2026

తెలుగు సినీ పరిశ్రమలో కుటుంబ కథా చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన నటుడు వడ్డే నవీన్ మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీశాయి. ఈ చిత్రం కోసం ఎంతో ఉత్సాహంగా పనిచేశానని వడ్డే నవీన్ తెలిపారు. తన సినీ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైన భావన కలుగుతోందని, ప్రేక్షకులు మరోసారి ఆదరిస్తారనే నమ్మకం ఉందన్నారు. చిత్రీకరణ సమయంలో ఎంత ఉత్సాహంతో పనిచేశానో, ఇప్పుడు ప్రచార కార్యక్రమాల్లో కూడా అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం తెలుగు సినిమా స్థాయి, దేశవ్యాప్త గుర్తింపు గురించి మాట్లాడుతూ అల్లు అర్జున్ ఎదుగుదలను ప్రత్యేకంగా ప్రశంసించారు. గత పదేళ్లలో అల్లు అర్జున్ సాధించిన విజయాలు నిజంగా అద్భుతమని, తెలుగు సినిమాను దేశవ్యాప్తంగా తీసుకెళ్లిన ప్రముఖ కథానాయకుల్లో ఆయన కూడా ఒకరని పేర్కొన్నారు. తెలుగు సినిమా దేశవ్యాప్త స్థాయికి చేరుకోవడంపై మాట్లాడిన వడ్డే నవీన్, 'బాహుబలి' మరియు 'పుష్ప' చిత్రాల విజయాలను పోల్చారు. 'బాహుబలి' విజయం కొంతవరకు ముందే ఊహించవచ్చని, ఎందుకంటే ఆ చిత్రంలోని కథ, నిర్మాణ విలువలు, దృశ్య వైభవం అత్యంత భారీ స్థాయిలో ఉన్నాయని అన్నారు. అలాంటి చిత్రం దేశవ్యాప్తంగా ప్రభావం చూపడం సహజమేనని వ్యాఖ్యానించారు. అయితే 'పుష్ప' విజయం మాత్రం పూర్తిగా భిన్నమైందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఆ చిత్రం సాధించిన ఆదరణ ఎంతో ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు.




### సింగ్ గీతంపై చిరంజీవి ఎమోషనల్ పోస్ట్

# ప్రశంసల వర్షం

హైదరాబాద్ -- 11-06-2026

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన 'సింగ్ గీతం' చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న వేళ మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సామాజిక మాధ్యమాల వేదికగా ఆయన ఈ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియ జేస్తూ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. సింగీతం శ్రీనివాసరావు దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించడమే కాకుండా, అనేక మంది కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గ దర్శకుడిగా నిలిచారని చిరంజీవి కొనియాడారు. అలాంటి గొప్ప దర్శకుడి నుంచి వస్తున్న 'సింగ్ గీతం' భారతీయ చిత్రసీమలో మరో మైలురాయిగా నిలవాలని, బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇలాంటి సీనియర్ దర్శకులను గౌరవిస్తూ, వారి అను భవాన్ని కొత్త తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న నిర్మాత నాగ్ అశ్విన్‌ను చిరంజీవి ప్రత్యేకంగా అభినం దించారు. ఒకవైపు సింగీతం శ్రీనివాసరావు వంటి దిగ్గజ దర్శకుడు, మరోవైపు నేటి తరం ఆలోచనలను ప్రతిబింబించే నాగ్ అశ్విన్ కలిసి పనిచేయడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అలాగే తనకు ఎంతో ఇష్టమైన సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించడం సినిమాపై మరింత ఆసక్తిని పెంచిందని తెలిపారు. సంగీతం కూడా చిత్ర విజయానికి కీలక బలంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్మాత నాగ్ అశ్విన్‌తో పాటు నిర్మాణ సంస్థల బృందానికి, చిత్రంలో నటించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులందరికీ చిరంజీవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంపై సినీ అభిమానుల్లో మంచి ఆసక్తి నెలకొంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467